## లబ్ధిదారులను ప్రోత్సహించాలి



పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, మే 20 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సైలాని బాబా కాలనీలో జరీనా బేగంకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మార్కింగ్ చేసినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి దశలవారీగా నిర్ధిష్ట సమయంలో చెల్లింపులు చేయనున్నట్లు చెప్పారు. త్వరగా ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం ఇండ్ల నిర్మాణ పత్రాన్ని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, వార్డు మాజీ కౌన్సిలర్ వనిత రాంమోహన్, వార్డు ఆఫీసర్, ఏఈ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పనులు త్వరగా పూర్తి చేసుకోవాలి

లింగంపేట(తాడ్వాయి)/లింగంపేట, మే 20: ఇందిరమ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారులు పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని డీఆర్డీవో సురేందర్ సూచించారు. మంగళవారం లింగంపేటలో గృహ నిర్మాణ పనులకు మార్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ష కాలం ప్రారంభమవుతున్నందున పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మల్హారీతోపాటు ఆయా గ్రామాల కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ గృహ నిర్మాణానికి హౌసింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తాడ్వాయి ఎంపీవో రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి, మే 20 : హత్య చేసిని నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.2 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన పసియుద్దీన్ అలియాస్ టిల్లు అనే వ్యక్తి వసీమా బేగం తలపై ఇనుపరాడుతో బలంగా పలుమార్లు కొట్టి హత్య చేశాడు. వసీమా బేగం భర్త షేక్ కలీముల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. పసియుద్దీన్ అలియాస్ టిల్లు వసీమా బేగం ఇంటి గోడకు ఆనుకొని రేకుల షెడ్ నిర్మించాడు. ఈ విషయంపై పలుమార్లు ఫసియుద్దీన్‌కు షెడ్డును కొంత పక్కకు వేసుకోవాలని కోరగా అతను చాలాసార్లు ఆమెతో గొడవ పడ్డాడు. సమస్యను పెద్ద మనుషుల సమక్షంలో చెప్పినా నిన్ను చంపుతాను అంటూ బెదిరించేవాడు. చివరికి 2022 మే 10వ తేదీన మున్సిపల్ అధికారులు వచ్చి ఆ రేకుల షెడ్డును తొలగించారు. ఇది మనసులో పెట్టుకొని వసీమా బేగం తన ఇంటి ఎదుట అరుగుపై కూర్చొని ఉండగా ఐరన్ రాడ్‌తో ఆమె తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. ఈ విషయంలో సరైన సాక్ష్యాలను సేకరించి, సాక్షులను విచారించి, సాక్ష్యాధారాలను పరిశీలించి కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జిల్లా న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. పోలీసు తరఫున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్ ఈ కేసును సరైన పద్ధతిలో విచారణ చేసిన అప్పటి ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్, ప్రస్తుత ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేశ్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, సీడీవో సాయిలును ఎస్పీ అభినందించారు.

# ఏడీఏ భవన నిర్మాణం పూర్తయ్యేనా..

- నిధులు రాకపోవడంతో మధ్యలోనే ఆగిపోయిన పనులు
- వాహనాల పార్కింగ్, తాగుబోతులకు అడ్డాగా మారిన భవనం

ఎల్లారెడ్డి రూరల్, మే 20 : పట్టణంలోని ఏడీఏ భవన నిర్మాణ పనులు అర్ధాంతంగా నిలిచిపోయాయి. ఏడీఏ(సహాయ వ్యవసాయ సంచాలకులు) భవన నిర్మాణ పనులు నిధులు రాకపోవడంతో వాహనాల పార్కింగ్‌కు, తాగుబోతులకు అడ్డాగా మారింది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వెనుకభాగంలో సహాయ వ్యవసాయ సంచాలకుల భవన నిర్మాణానికి 2015లో అప్పటి రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి 40లక్షల రూపాయల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. 3శాతం తక్కువతో టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించాడు. 2016లో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ వరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దాదాపు 70శాతం పనులు పూర్తి కాగా ప్లాస్టరింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, ఫ్లోరింగ్ పనులు మాత్రం మిగిలాయి. నిధులు రాకపోవడంతో జరిగిన పనులకు సంబంధిత పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కాంట్రాక్టర్ ఎంబీ నమోదు చేయించగా 18 లక్షల రూపాయలు మాత్రమే వచ్చాయి. సదరు కాంట్రాక్టర్ పెట్టిన డబ్బులు రాకపోవడంతో ఆవేదనతో.. చాలా నష్టపోయానని, పనులు చేయలేనని తేల్చి చెప్పడంతో, దాదాపుగా చివరి దశకు చేరుకున్న భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయి. నిరుపయోగంగా మారి.. భూత్ బంగ్లాగా కనిపిస్తున్నది. అసంపూర్తి పనులతో ఏడీఏ భవనం మూలకు పడడంతో వాహనాల పార్కింగ్, సాయంత్రం, రాత్రి వేళల్లో తాగుబోతులకు అడ్డాగా మారింది. 10 సంవత్సరాలుగా నిధులు లేక అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. నాలుగేండ్ల క్రితం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మిగిలిన పనుల కోసం పెరిగిన వ్యయానికి అనుగుణంగా రూ.33 లక్షలు, ప్రహరీ నిర్మాణం కోసం రూ.7 లక్షల ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసి, వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. నిధులు లేవని చేతులెత్తివేయడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. అసంపూర్తిగా ఉన్న ఏడీఏ కార్యాలయ భవన నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తే పనులు చేసుకునే అవకాశం లేకపోలేదని పలువురు చర్చించుకుంటున్నారు. నిధులు రాక, పనులు పూర్తి కాక, అర్ధాంతరంగా భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే అవకాశం ఉందని ప్రజలు స్థానికులు అంటున్నారు. నిలిచిన భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు అవుతాయో.. లేదో.. వేచి చూడాల్సిందే.



ఎల్లారెడ్డి పట్టణంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఏడీఏ భవనం



భవనంలో పార్కింగ్ చేసిన వాహనాలు

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి




మాట్లాడుతున్న డీఈవో రాజు

కామారెడ్డి/లింగంపేట, మే 20 : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని డీఈవో రాజు అన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 15 రోజులపాటు నిర్వహించిన వేసవి శిబిరం ముగింపు కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పక్షం రోజులపాటు కర్ణాటక సంగీతం, నృత్యం, పేయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, స్పీడ్ మ్యాథ్స్ తదితర అంశాలపై అందించిన శిక్షణ విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి దోహం చేస్తుందని అన్నారు. జిల్లాలోని 19 కేజీబీవీల నుంచి 112 మంది విద్యార్థులు అన్ని అంశాల్లో నైపుణ్యం సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, బాలికల విద్యా సమన్వయకర్త సుకన్య, సమన్వయ కర్తలు నాగవేందర్, వెంకట రమణారావు, కృష్ణ చైతన్య, స్పెషల్ ఆఫీసర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు. లింగంపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో చిన్నారులకు డ్యాన్సింగ్, చిత్రలేఖ నంపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంఈవో షౌకత్‌అలీ తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో డ్యాన్స్‌మాస్టర్ ప్రదీప్, ఆర్టిస్ట్ ఖాసీం పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో కార్మికుల నిరసన

పెద్దకొడప్‌గల్(పిట్లం), మే 20 : పిట్లం మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుర్రెం బాలరాజ్ మాట్లాడుతూ.. ఏఐటీయూసీ రాష్ట్ర పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న ప్రతి కార్మికుడికీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణ, బాలయ్య, పీరయ్య, శ్రీనివాస్, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.



పిట్లంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు



బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

## సమస్యలు పరిష్కరించాలి

బాన్సువాడ, మే 20 : బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన పత్రాన్ని కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నేత దుబాస్ రాములు మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సాయిలు, భుమయ్య, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మాచారెడ్డిలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి/రాజంపేట్/బీబీపేట్/బిక్కనూరు, మే 20 : ఉమ్మడి మాచారెడ్డి మండలంలోని 58 మంది లబ్ధిదారులకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనారోగ్యానికి గురైన వారికి సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని లబ్ధిదారులకు సూచించారు. రాజంపేట్‌లోని రైతు వేదికలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆరుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బీబీపేట, దోమకొండ మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. భిక్కనూరులోని రైతు వేదికలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి 25 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు..**



చెక్కులను పంపిణీ చేస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, మే 20 : బాన్సువాడలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి తన నివాసంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

## ఎరువుల గిడ్డంగి తనిఖీ

నస్రుల్లాబాద్, మే 20 : మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలోని ఎరువుల గిడ్డంగిని ఏడీఏ అరుణ మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతులకు విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతు కొన్న విత్తనాలకు రశీదులు ఇవ్వాలని సూచించారు. రైతులకు త్వరలోనే జీలుగ విత్తనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి భవాని తదితరులు ఉన్నారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

రాజంపేట్/ఎల్లారెడ్డి రూరల్, మే 20 : రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలి కామారెడ్డి ఏడీఏ అపర్ణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండలంలోని రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేసన్ చేసినట్లు ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు అఖిల, సవిత, బాలకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామంలో వ్యవసాయ విస్తీర్ణాధికారి రాజాగౌడ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించారు.


## గంగమ్మ వాగుపై వంతెన నిర్మించాలి



రామారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి

రామారెడ్డి, మే 20 : మండల కేంద్రంలో గంగమ్మవాగు బ్రిడ్జి (వంతెన ) నిర్మాణం కోసం రూ. 3 కోట్ల 8 లక్షలతో అప్పటి ఎమ్మెల్యే జాజాల సురేందర్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారని, కానీ నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్లయినా ఇంకా వంతెన పనులు పూర్తి చేయక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వెంటనే స్పందించి వచ్చే వర్షాకాలం లోపు వంతెన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. లేని యెడల అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలభైరవస్వామి ఆలయ మాజీ చైర్మన్ గంజి సతీశ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్, ఇసన్నపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు గంగాధర్, కన్నాపూర్ మాజీ సర్పంచ్ రాజనర్సు, మల్లేశ్ యాదవ్, సుధాకర్, జంగం లింగం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నెట్‌బాల్ విన్నర్‌గా నిలిచిన విద్యార్థులకు సన్మానం




విద్యార్థులను సన్మానిస్తున్న జిల్లా నెట్ బ్యాలెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నాగిరెడ్డిపేట, మే 20: జనగామలో జరిగిన నెట్ బాల్ మిక్స్‌డ్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా నెట్‌బ్యాలన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీధర్, కార్యదర్శి రఘు మంగళవారం ఘనంగా సన్మానించి మెమొంటోలను అందించారు. అందులో గోపాల్‌పేట ఉన్నత పాఠశాలకు చెందిన సబ్ జూనియర్ మిక్స్‌డ్ నెట్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో వెన్నెల ( 9వ తరగతి), మనస్వి( 9వ తరగతి), నందిని(8వతరగతి) ప్రాతినిధ్యం వహించారని పీఈటీ సభాత్ కృష్ణ తెలిపారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## సైబర్‌క్రైమ్‌పై అవగాహన

రామారెడ్డి, మే 20: మండల కేంద్రంలో మంగళవారం బండకొమ్ము చౌరస్తా వద్ద ప్రజలకు రామారెడ్డి ప్రొహిబిషనరీ ఎస్సై నవీన్ చంద్ర సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు.ఆన్‌లైన్ బెట్టింగ్‌లు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పవన్, సంపత్‌కుమార్, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రాక

లింగంపేట, మే 20: మండలంలోని పర్మళ్ల గ్రామానికి బుధవారం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ రానున్నట్లు పర్మళ్ల గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. పర్మళ్ల గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన పెద్దమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేలా బోధించాలి



ఎల్లారెడ్డి కస్తూర్బాలో ఎస్జీటీలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో రాజులు



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో షౌకత్ అలీ



నిజాంసాగర్‌లోని ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో అమర్‌సింగ్

బాన్సువాడ రూరల్/రాజంపేట్/నస్రుల్లాబాద్/ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట/నిజాంసాగర్, మే 20 : తరగతి గదిలో పాఠ్యాంశాల బోధన విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేలా ఉండాలని ఎంఈవో నాగేశ్వర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల వేసవి శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోర్లం ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఎమ్మార్పీలు సంతోష్, సుధాకర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, రవికుమార్, వాజీద్, పండరి, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాజంపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో పూర్ణచంద్రరావు ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, స్వామి, శ్రీధర్‌గౌడ్, రాజేందర్, నవీన్, రవిశంకర్, నిరూపరాణి, సుజాత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. నస్రుల్లాబాద్‌లోని ఉన్నత పాఠశా లలో ఎంఈవో చందర్ ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఎల్లారెడ్డి పట్టణంలోని కసూర్బా పాఠశాలలో మండల స్థాయి ఎస్జీటీల శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పలు విషయాలపై ఉపాధ్యాయులకు మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజులు, ఆర్పీలు నాగం నాగరాజు, దాసీరాం, నాగరాజు, శివకుమార్, గోవర్ధన్, బాబూరావు, రేణుక , సీఆర్పీలు, దత్తాత్రి, మహేశ్, మహిపాల్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని మండల విద్యాశాఖ అధికారి షౌకత్‌అలీ సూచించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించడం వల్ల సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్పీలు రాములు, మహిపాల్, దామోదర్, సంజీవ్, మాధురి, గోపాల్, చంద్రశేఖర్‌తో పాటు సీఆర్పీలు పాల్గొన్నారు. తాడ్వాయిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఈవో రాజు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఉమ్మడి ని జాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల ఎంఈవోలు తిరుపతిరెడ్డి, అమర్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో అచ్చంపేట కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్‌రాంరెడ్డి, నిజాంసాగర్ హెచ్ఎం వెంకటేశం, ఎమ్మార్పీలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేటలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో పూర్ణచంద్రరావు



నస్రుల్లాబాద్ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో చందర్

# రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలి

- డీఆర్డీవో సురేందర్

నాగిరెడ్డిపేట, మే 20: రైతులు పండ్ల తోటల పెంపకం చేపట్టి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో సురేందర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. రాజీవ్ యువ వికాస్ పథకం వివరాలను ఎంపీడీవో ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో బ్యాంకు మేనేజర్లతో మాట్లాడి అర్హులైన లబ్ధిదారుల వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో 41,557 మంది పథకానికి దరఖాస్తు చేసుకోగా, 13,450 యూనిట్లు జిల్లాకు కేటాయించినట్లు చెప్పారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత బ్యాంకులకు పంపించామని పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలో 12వేల దరఖాస్తులు రాగా, కేవలం 131 దరఖాస్తుల పరిశీలన పూర్తికావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐకేపీ ఏపీఎం, సీసీల సహాయం తీసుకొని త్వరగా పరిశీలన పూర్తి చేయాలని చెప్పారు. ఈనెల 25లోగా జిల్లా ఇన్‌చార్జి మంత్రితో సమీక్షించి యూనిట్ల మంజూరుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంఘాల సభ్యులు ఆదాయ అభివృద్ధి కార్యక్రమలు చేపట్టాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో హార్టికల్చర్ ద్వారా మునగ పంటల సాగుకు అవకాశాలు ఉన్నాయన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేందుకు అవకాశం ఉన్నదని, ఉపాధి హామీ పథకం ద్వారా గుంతలు తీయించడంతో పాటు నీరు పారించేందుకు సైతం కూలి డబ్బులను అందిస్తామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ ద్వారా 683 సంఘాలకు రూ.36 కోట్ల 80 లక్షల లక్ష్యంగా ఉన్నదన్నారు. ఇట్టి రుణాల వినియోగంపైన కార్యాచరణ, ప్రణాళికలను సిద్ధంచేసుకోవాలని సిబ్బందికి సూచించారు. స్త్రీ నిధి రుణాల రికవరీ చేయాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్ల లక్ష్యం వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో స్త్రీనిధి జనరల్ మేనేజర్ కిరణ్, ఏపీఎం జగదీశ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, ఆయా గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, సీఏలు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఆర్డీవో సురేందర్

## కాలబైరవస్వామిని దర్శించుకున్న తెలంగాణ జాగృతి యూత్ అధ్యక్షుడు



స్వామిని దర్శించుకుంటున్న సంపత్ కుమార్‌గౌడ్

రామారెడ్డి, మే 20 : ఇసన్నపల్లి, రామారెడ్డి గ్రామాల్లో వెలసిన శ్రీ కాల భైరవస్వామిని మంగళవారం తెలంగాణ రాష్ట్ర జాగృతి యూత్ అధ్యక్షుడు ఎదురుగట్ల సంపత్‌కుమార్ గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

## వ్యక్తి అదృశ్యం



కాశీరాం (ఫైల్)

లింగంపేట, మే 20: మండలంలోని ముంబాజీపేట గ్రామానికి చెందిన వస్కూరి కాశీరాం అనే వ్యక్తి అదృశ్యమైనట్లు స్థానిక ఎస్సై వెంకట్రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాశీరాం మూడు రోజుల క్రితం భార్య రాణితో గొడవ పడ్డాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి ఎంతకూ తిరిగి రాకపోవడంతో భార్య రాణి బంధువులు, స్నేహితు లు, తెలిసిన వారి వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాశీరాం ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



మురికి కాలువలు శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

లింగంపేట, మే 20: మండల కేంద్రంలోని ఆయా వార్డుల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. అన్ని వార్డుల పరిధిలో ఉన్న మురికి కాలువలు శుభ్రం చేయడంతో పాటు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. వర్షా కాలం సమీపిస్తున్నందున ముందు జాగ్రత్త చర్యగా కాలువలు శుభ్రం చేయడంతో పాటు మట్టి, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో వరదనీరు రహదారిపైకి రాకుండా ముందస్తుగా శుభ్రం చేయిస్తున్నట్లు ఆయన వివరించారు.

## గ్రామ కార్యదర్శులతో సమీక్ష

నిజాంసాగర్, మే 20 : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీవో ప్రమీల అధ్యక్షతన గ్రామ కార్యదర్శులకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో రెండు రోజుల్లో ముగ్గు పోయించి, నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి. గంగాధర్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ ఆలయానికి విరాళం అందజేత

నాగిరెడ్డిపేట, మే 20 : మండల కేంద్రంలో నిర్మించిన పెద్దమ్మ ఆలయానికి పోచారం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ.10,500 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు కిష్టయ్య, బోయిని విఠల్‌కు మంగళవారం అందజేశారు. పెద్దమ్మ ఆలయానికి తమ వంతు సహాయంగా ఈ విరాళం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పోచారం ముదిరాజ్ సంఘం నాయకులు ఏముల మల్లేశం, ఏముల కిరణ్, సత్యబోయిన రమేశ్, మేకల రమేశ్, మేకల ప్రభాకర్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.